క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులతో కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోట్ల హరి చక్రపాణి రెడ్డి , ఆదిమూలపు సతీష్

కర్నూలు(రూరల్): మండలంలోని పసుపుల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత జరదొడ్డి వెంకట రాముడు కుమారుడు ప్రవీణ్ వివాహం శుక్రవారం కర్నూలు నగరంలోని హోసన్న మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి , సీనియర్ నాయకులు కోట్ల హరి చక్రపాణి రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్ తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

సోలార్ భూముల పరిశీలన



భూ వివరాలు పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

పాణ్యం: మండల పరిధిలోని కందికాయపల్లె గ్రామంలో సలార్ పరిశ్రమకు మరో 35 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు ఆ భూములను నంద్యాల జేసీ విష్ణుచరణ్ శుక్రవారం పరిశీలించారు. గ్రామ పరిధిలో ఉన్న 35 ఎకరాల భూముల వివరాలు, హద్దులు, మ్యాప్, తదితర వాటిపై ఆరా తీశారు. అలాగే ఇది వరకు సోలార్‌కు కేటాయించిన భూములు, నిర్మాణ పనులపై విచారణ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నిల్వల్లో తేడాలు ఉంటే చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: ఎరువులు, పురుగు మందుల అమ్మకాలు, నిల్వల్లో తేడాలు ఉంటే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్లోని ఓం మురళీసాయి అగ్రో ఏజెన్సీస్, శివసాయి ఫర్టిలైజర్స్, శ్రీ మంజునాథ ట్రేడర్స్ ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందుల అమ్మకాల రికార్డులను, భౌతిక న్విలలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. దుకాణదారులతో ఏఓ మాట్లాడుతూ రైతులకు ఎరువులను ఈ పాస్ ద్వార మాత్రమే అమ్మకాలు జరపాలని సూచించారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న శ్రీపంచముఖి వినాయక మండపం సభ్యులు

కోడుమూరు రూరల్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కోడుమూరులోని శ్రీలక్ష్మీనగర్‌లో ఏర్పాటు చేసిన శ్రీపంచముఖి వినాయక మండపం సభ్యులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన మహిళలు సోమేశ్వరీ, మౌనిక, లక్ష్మీలకు చీరలు బహూకరించారు. అలాగే పోటీల్లో పాల్గొన్న మిగిలిన మహిళలకు కూడా కన్సొలేషన్ బహుమతులను వినాయక మండపం సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో వినాయక మండపం సభ్యులు అశోక్, శ్రీనివాసులు, నరసప్ప, శంకర్, నాగేష్, జయరాం పాల్గొన్నారు.

ఏరులై పారిన మద్యం..

కోడుమూరు రూరల్: మండలకేంద్రంతో పాటు గ్రామాల్లో మద్యం ఏరులై పారింది. వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా మద్యం దుకాణాలు మూసివేయాలని పోలీసులు సూచించారు. ఊరూరా బెల్టుషాపులు ఉండటంతో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. క్వార్టర్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేశారు. పలు చోట్ల మూసి ఉన్న మద్యం దుకాణాల ముందే మద్యం విక్రయాలు సాగాయి. కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, అధికారులు ప్రేక్షక పాత్ర పోషించారనే విమర్శలు వినిపించాయి.

హాకీ విజేత మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టు

కర్నూలు (టౌన్): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల హాకీ పోటీల్లో నగరంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. రెండో రోజు శుక్రవారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో మిలిటరీ కాలనీకి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టుపై 2–0 గోల్స్ చేసి మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టు గెలుపొందింది. బాలికల విభాగంలో మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టుపై గార్గేయపురం జిల్లా పరిషత్ జట్టు 3–0 గోల్స్ చేసి విజేతగా నిలిచింది.





కోడుమూరులో నిమజ్జనానికి ఊరేగింపుగా తరలి వెళుతున్న వినాయక విగ్రహాలు, సి. బెళగల్లో భక్తజనం మధ్య భారీ గణనాథుడి ఊరేగింపు

వినాయకా.. సెలవిక

- కోడుమూరులో ఘనంగా గణేష్ నిమజ్జనం

కోడుమూరు రూరల్ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కోడుమూరులో వాడవాడలా కొలువుదీరిన గణపతులను శుక్రవారం సాయంత్రం పట్టణంలోని వెంకటగిరి రోడ్డువైపునున్న బావిలో నిమజ్జనం చేశారు. ముందుగా వినాయకులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి వాహనాలపై కూర్చొబెట్టి మేళతాళాల మధ్య మెయిన్‌బజార్ గుండా ఊరేగించారు. సాయంత్రం 3గంటల నుంచి రాత్రి వరకు వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగింది. నిమజ్జన బావి వద్ద విగ్రహాలకు గ్రామ సర్పంచు భాగ్యరత్న, ఎస్ఐ ఎర్రిస్వామి, రెవెన్యూ సిబ్బంది, నిమజ్జన కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరగడానికి కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్ఐ ఎర్రిస్వామి తమ సిబ్బందితో కలిసి గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. మండలంలోని వర్కూరు, వెంకటగిరి, క్రిష్ణాపురం, ముడుమలగుర్తి, గోరంట్ల, పులకుర్తి తదితర గ్రామాల్లో కూడా వినాయక నిమజ్జన వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకున్నారు.



సి.బెళగల్లో వినాయక నిమజ్జనంలో చిందులు వేస్తున్న యువత



కోడుమూరులో విగ్రహాలను బావిలో నిమజ్జనం చేస్తున్న అధికారులు, నిమజ్జన కమిటీ సభ్యులు

- సి.బెళగల్: మూడు రోజులు పూజలందుకున్న గణనాథులు శుక్రవారం గంగమ్మ ఒడికి చేరారు. వినాయకుడి చేతిలోని లడ్డూలను, పూజ టెంకాయాలను, చెరకు గడలను నిర్వాహకులు వేలాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు పాల్గొని మత సామరస్యాన్ని చాటారు. మండల కేంద్రం సి.బెళగల్‌లో ఏర్పాటు చేసిన బాల గణపతి మండపంలో స్వామి లడ్డూకు లాటరీ నిర్వహించగా టైలర్ ఓబులేష్ అనే వ్యక్తికి లభించడంతో సర్పంచ్ పాండురంగన్న, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముందరింటి వెంకటేష్ అందజేశారు. బ్రాహ్మణదొడ్డిలో వినాయకుడి లడ్డూను అదే గ్రామానికి చెందిన బోయ మౌలాలి వ్యక్తి దక్కించుకున్నాడు. కాగా ఎస్ఐ పరమేష్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



గడిగరేవులలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

కల్లూరు: మూడు రోజులుగా పూజలందుకున్న గణనాథులు శుక్రవారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఉలిందకొండ, చిన్నటేకూరు, బస్తిపాడు తదితర గ్రామాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హంద్రీ–నీవా కాలువలో నిమజ్జనం చేశారు. ఉలిందకొండ గణనాథుడి లడ్డు వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన గొల్ల పరుశరాముడు రూ. 25వేలకు లడ్డూను దక్కించుకున్నారు. ఉలిందకొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ ఈవీ రమణ, నిర్వాహకులు పాల్గొన్నారు.

- గడివేముల: జైబోలో గణేష్ మహారాజ్‌కీ జై..అంటూ గ్రామాల్లో కొలువైన గణనాథులను శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. గడివేముల మండలంలో మొత్తం 62 విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఒక్క మండల కేంద్రం గడివేముల మినహా అన్ని గ్రామాల్లో చిన్నా,పెద్దా, మహిళలు అనే తేడా లేకుండా భక్తిశ్రద్ధలతో నిమజ్జన వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. వినాయకుని చేతుల్లో ఉన్న లడ్డూలను కొనుగోలు చేసేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. వేలం పాటలో లడ్డూను దక్కించుకుని పంట పొలాల్లో చల్లితే పంటలు సమృద్ధిగా పండుతాయని భక్తుల నమ్మకం. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పాణ్యం సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ సీసీ నాగార్జునరెడ్డి సిబ్బందితో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



ఉలిందకొండలో వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న భక్తుడు

సందడిగా..

పాణ్యం: మండలంలో ఏర్పాటు చేసిన గణనాథ విగ్రహాలకు మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు అర్చనలు, అన్నదానం జరిపిన నిర్వాహకులు సాయంత్రం నుంచి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. గణపతి బప్పా మోరియా నినాదాలు, మంగళవాయిద్యాలు, నృత్యాల నడుమ రంగులు చల్లుకుంటూ శోభా యాత్ర సందడిగా సాగింది.

పోలీసుల సూచన మేరకు మూడో రోజు ఎక్కువ విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జన ఘాట్‌ల వద్ద నిబంధనలు అమలు చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులను అనుమతించలేదు. మండల కేంద్రం పాణ్యం సహా పలు పెద్ద గ్రామాల్లో ఐదు రోజుల పాటు గణనాథుడికి పూజలు జరగనున్నాయి.





పాణ్యం రచ్చకట్ట వద్ద అన్నదానం, గోరుకల్లులో వినాయకుడి ముందు నృత్యాలు చేస్తున్న భక్తులు



బూజునూరు గ్రామంలో..

లంబోదరుడికి చాక్లెట్‌ల మాల

వినాయక చవితిని పురస్కరించుకుని విఘ్నేశ్వరుడికి వివిధ రకాల పూలమాలలు వేయడం సర్వసాధారణం. అయితే పాణ్యం బీసీ కాలనీకి చెందిన ఎల్లప్ప కౌలూరులో ఏర్పాటు చేసిన గణనాథుడికి శుక్రవారం 800 చాక్లెట్‌లతో తయారు చేసిన మాలను వేసి భక్తిభావాన్ని చాటుకున్నారు. ఇందుకు రూ.2 వేలకుపైగా ఖర్చు వచ్చిందని భక్తుడు తెలిపారు.



చాక్లెట్‌ల మాల

రీసర్వే వేగవంతం చేయాలి

కోడుమూరు రూరల్: భూ రీసర్వేను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో జరుగుతున్న రీసర్వే జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా మొదటగా అసైన్డ్, ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వరాదన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జేసీ వెంట ఆర్డీఓ సందీప్‌కుమార్, జిల్లా సర్వేయర్ విజయకుమారి, కోడుమూరు తహసీల్దార్ నాగరాజు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



ప్యాలకుర్తిలో రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ నవ్య

ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దు

కల్లూరు: గ్రామాల్లో రోడ్లపై, వీధుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయరాదని ఎంపీడీఓ నాగేశేషాచలరెడ్డి అన్నారు. శుక్రవారం ఉలిందకొండ గ్రామంలో ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ నాగష్ పర్యటించారు. గ్రామస్తులు చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా అందించాలని ప్రజలకు వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవన్నారు. పంచాయతీ కార్యదర్శి చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాతృ భాష వ్యక్తిత్వ వికాసానికి దోహదం

- గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్‌కు ఘన నివాళి
- తెలుగులో మాట్లాడుదాం, తెలుగు భాషను కాపాడుకుందాం అంటూ నినాదాలు

ఓర్వకల్లు: మాతృభాష వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని నన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో మాతృ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్యామలమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిడుగు రామ్మూర్తి జీవిత విశేషాలు, తెలుగు భాషకు చేసిన సేవలను ఉపాధ్యాయులు వివరించారు. అలాగే క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్‌చంద్ జీవిత విశేషాలు, ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఉపాధ్యాయులు ఇందిరా ప్రియదర్శిని, రామకృష్ణ, రాజీవ కుమారి, ఏపీ గ్రీన్ కోర్ క్లస్టర్ కోఆర్డినేటర్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

పాణ్యం: మండలంలోని ఆయా పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గిడుగురామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగుభాష గొప్పదనం, భాష ప్రాధాన్యత, గిడుగు రామ్మూర్తి జీవిత విశేషాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులు భువనవిజయ నాటకాన్ని ప్రదర్శించారు. పాటలు, నృత్యాలతో అలరించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థులు వస్త్రాలు ధరించి నృత్యాలు చేయడం ఆకట్టుకుంది. అలాగే బలపనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గిడిగు చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్‌ఎం నారాయణ, ఉపాధ్యాయులు మహబూబ్‌బాషా, షఫాణి, శ్రీలక్ష్మీ పాల్గొన్నారు. అలాగే ధాన్యన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు.



పాణ్యం: విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీరాములు నాయక్

ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి

కర్నూలు(రూరల్): గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని శుక్రవారం పూడురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం రెడ్డిపోగు రాజు పాల్గొని ముందుగా గిడుగు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్లు, ఫిజికల్ డైరెక్టర్ రాజేశ్వరి, శివశంకర్, నారాయణ రెడ్డి, సురేంద్ర, దస్తగిరి, ద్రాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.



తెలుగు ఉపాధ్యాయుడు నాగేంద్రుడిని సన్మానిస్తున్న హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో శుక్రవారం జరిగిన వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుంది. విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మండలకేంద్రంలోని దాసరి వీధిలో నెలకొల్పిన వినాయకుడిని గంగమ్మ ఒడికి చేర్చేందుకు ట్రాక్టర్‌పై ఊరేగింపుగా బయలుదేరారు. కృష్ణదొడ్డి గ్రామ రోడ్డులో చెరువు కట్టపై ఉన్న విద్యుత్‌వైర్లకు విగ్రహం తగలడంతో కరెంట్ ప్రసారమైంది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న వారందరికీ షార్ట్‌సర్క్యూట్ అయింది. ఈ ఘటనలో రుద్రయ్య ఏకైక కుమారుడు చందు (19) తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేయగా మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

1న మండల మీట్

కర్నూలు(రూరల్): కర్నూలు మండల సర్వసభ్య సమావేశం వచ్చేనెల 1న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్ వెల్లడించారు. కర్నూలు మండల ప్రజాపరిషత్ కార్యాలయం మీటింగ్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపిటీసీ సభ్యులు, గ్రామాల సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరవుతారన్నారు.

మారిన జీవనశైలితో కొత్త వ్యాధులు

కర్నూలు(హాస్పిటల్): ఆహారపు అలవాట్లు, మారిన జీవనశైలి కారణంగా కొత్త కొత్త వ్యాధులు పుట్టుకొస్తున్నాయని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్ మహేశ్వరప్రసాద్ చెప్పారు. శుక్రవారం స్థానిక డాక్టర్స్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్‌సీడీ 4.ఓ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ఒత్తిడితో కూడుకున్న జీవితం, క్షణం తీరికలేకుండా మనిషి వ్యాధులతో సతమతమవుతున్నాడని చెప్పారు. ఇందులో అధిక రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాతం, నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లు ఉన్నాయని తెలిపారు. వీటిని ముందుగా గుర్తించి చికిత్స అందించాలని చెప్పారు. కార్యక్రమంలో సంచార చికిత్స కార్యక్రమ అధికారి డాక్టర్ రఘు, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీలకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్యులకు ప్రొఫెసర్లుగా పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న ముగ్గురు కంటి వైద్యులకు ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించి కౌన్సి లింగ్ ద్వారా బదిలీ చేశారు. ఈ మేరకు వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో కర్నూలులోని ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ టి.పెంచలయ్యను వైఎస్సార్ కడపలోని జీఎంసీకి, డాక్టర్ పి.ఆర్. నివేదితను నంద్యాల జీఎంసీకి, నంద్యాల జీఎంసీలో పనిచేస్తున్న డాక్టర్ ఎన్.కస్తూరిబాయిని అనంతపురం జీఎంసీకి పదోన్నతిపై బదిలీ చేశారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

ఓర్వకల్లు: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా యువజన సంక్షేమ శాఖ (సెట్కూర్) సీఈఓ వేణుగోపాల్ సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్‌సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ మోసాలు, మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ గురువయ్యశెట్టి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సీఈఓ వేణుగోపాల్, జిల్లా ఉపాధి కల్పనాధికారి సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. డిజిటల్ టెక్నాలజీ మన దైనందిన జీవితంలో భాగమైందని, కానీ అదే టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ కొంతమంది సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. బ్యాంక్ అధికారుల పేరుతో ఫోన్లు చేయడం, నకిలీ లింకులు పంపి నగదు తస్కరించడం, కేవైసీ పేరుతో మోసాలు జరుగుతున్నాయని వివరించారు. అలాగే, సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకుని మహిళల ఫొటోలు, వీడియోలను దుర్వినియోగం చేస్తూ బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఘటనలు ఎక్కువవుతున్నాయని జిల్లా ఉపాధి కల్పనాధికారి సోమశేఖర్‌రెడ్డి అన్నారు. అనుమానాస్పద కాల్స్, నకిలీ ఎస్ఎంఎస్‌లు వచ్చినప్పుడు 1930 సైబర్ హెల్ప్‌లైన్, 112 నేషనల్ పోలీసు హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు, సెట్కూర్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్

బతికుండగానే చంపేశారు

సి.బెళగల్: కూటమి ప్రభుత్వం పేదల జీవితాలతో చెలగాటమాడుతోంది. ఏకంగా బతికున్న వ్యక్తులు చనిపోయినట్లు చూపించి సంక్షేమ పథకాలను ఎగ్గొడుతోంది. తాజాగా ఇలాంటి సంఘటనే సి. బెళగల్ మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డిలో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. ఈడిగ లక్ష్మీదేవి అనే మహిళకు 2813523330 నంబర్ గల రైస్ కార్డు ఉంది. మొత్తం నలుగురు సభ్యులున్న ఈ కార్డులో ముగ్గురికి మాత్రమే గత నెలలో రేషన్ వేశారు. కారణమేమిటని కుటుంబసభ్యులు సచివాలయానికి వెళ్లి ఆరా తీయగా లక్ష్మీదేవి చనిపోయినట్లు ఆన్‌లైన్‌లో నమోదైనట్లు తెలిపారు. బతికుండగానే తనను ఎలా చంపేస్తారని వాపోతూ బాధితురాలు సమస్య పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతోంది. దాదాపు నెల రోజుగా సచివాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మండల సీఎస్ డీటీ నవీన్‌కుమార్‌ను వివరణ కోరగా ఈ సమస్య తన దృష్టికి వచ్చిందని, తహసీల్దార్ లాగిన్‌లో రీటేక్ చేయించమని వీఆర్వోకు తెలిపినట్లు చెప్పారు. ఇదిలా ఉంటే సంక్షేమ పథకాలను ఎగ్గొట్టేందుకు పేదల పట్ల కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరికాదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



తన రైస్‌కార్డు చూపుతున్న బాధితురాలు ఈడిగ లక్ష్మీదేవి

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం
- నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక నగర పాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీలకు చెందిన ప్రజలు అర్జీలు, ఎల్ఆర్ఎస్, నిర్మాణ అనుమతులు, అక్రమ నిర్మాణాలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నిర్వహిస్తామని, నగర ప్రజలు సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ఎల్ఆర్ఎస్ (లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) పథకం ద్వారా తమ లేఔట్లను క్రమబద్ధీకరించుకోవాలని చెప్పారు. వచ్చే అక్టోబర్ నెల వరకు గడువు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డీసీపీ వెంకటరమణ, టీపీఎస్ అంజాద్ బాషా, సూపరింటెండెంట్ సుబ్బన్న, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పి. విశ్వనాథ్

లోక్ అదాలత్‌లో రాజీ

కర్నూలు(సెంట్రల్): సర్టిఫికెట్ల విడుదలకు సంబంధించి వాది, ప్రతివాదుల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనపై ఇరు పార్టీలను శాశ్వత లోక్ అదాలత్ రాజీ చేసి పరిష్కారం చూపింది. నంద్యాలకు చెందిన పి.యశోద (వాది), జేపీ ఒకేషనల్ జూనియర్ కాలేజీ (ప్రతివాది)లో 2021–23లో ఏఎన్ఎం కోర్సులో చేరి పూర్తి చేసింది. అయితే కోర్సు పూర్తి చేసే సందర్భంలోనే ఆమె పూర్తి ఫీజును కళాశాలకు చెల్లించింది. చేరే సమయంలో కళాశాలలో ఇచ్చిన సర్టిఫికెట్లను తిరిగి ఇవ్వాలని కోరగా యాజమాన్యం అదనంగా రూ.20 వేలు కట్టాలని షరతు పెట్టింది. దీంతో సేవల్లో లోపంగా భావించిన ఆమె లోక్ అదాలత్‌ను ఆశ్రయించడంతో ఇద్దరికి నోటీసులు వారి మధ్య రాజీ కుదుర్చింది. ఆమె రూ.16 వేలు కట్టించడంతో కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లను ఆమెకు అందజేసినట్లు శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్, సభ్యులు టి.శివశంకర్‌రెడ్డి, రాజుబాబు తెలిపారు.